వేకువ
# సమయం

సంపుటి: 14 సంచిక: 154

VEKUVA SAMAYAM TELUGU DAILY


⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శనివారం 27 జూన్ 2026







**సమయం ప్రతినిధి:** రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. నిన్న రాత్రి రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడింది. నల్ల సముద్రం, అజోవ్ సముద్రం సహా రష్యా పరిధిలోని మొత్తం 12 ప్రాంతాలపై ఏకంగా 660 డ్రోన్‌లను ప్రయోగించింది. అయితే, ఈ దాడులను సమర్థవంతంగా అడ్డుకున్నట్టు రష్యా మరో ప్రకటనలో తెలిపింది. ఉక్రెయిన్ జరిపిన భారీ డ్రోన్ దాడుల్లో ఇదీ ఒకటని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్ల క్రితం యుద్ధం మొదలైంది. అయితే, ఇటీవల కాలంలో ఉక్రెయిన్ రష్యాపై డ్రోన్ ఆపరేషన్స్‌ను నిర్వహిస్తోంది. భారీ సంఖ్యలో డ్రోన్‌లను ప్రయోగిస్తూ రష్యాను ఉక్కిరిబిక్కిరి చేసే ప్రయత్నం చేస్తోంది. రష్యాలోని భూభాగాల్లోకి చొచ్చుకెళ్లిన డ్రోన్ దాడులు చేస్తోంది. రష్యా చమురు రంగాన్ని దెబ్బతీసేలా ఉక్రెయిన్ వ్యూహాత్మక దాడులు చేస్తోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రష్యా ఇంధన రంగాన్ని దెబ్బతీసి నిధులు అందకుండా చేయాలని ఉక్రెయిన్ ప్రయత్నిస్తోంది. శాంతిస్థాపనకు అమెరికా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య పరస్పర దాడులు తగ్గాయి. అయితే, అమెరికా ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ఉక్రెయిన్ ఇలాంటి దాడులు చేస్తోంది. రష్యాపై 40 రోజుల ఇన్‌ఫ్లుయెన్స్ ఆపరేషన్ ప్రారంభించినట్టు ఇటీవలే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇత తాజా దాడిలో రష్యాలోని ఒక రసాయనిక కర్మాగారం దెబ్బతిందని స్థానిక గవర్నర్ తెలిపారు. ఈ దాడిలో ఒక మహిళ గాయపడింది.




**సమయం ప్రతినిధి:** అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై కొనసాగుతున్న వివాదం మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే ట్రస్టీ అనిల్ మిశ్రా కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇద్దరూ నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.విరాళాల లెక్కింపులో, నగదు నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయి. ఆలయ ఖాతాలనుంచి దాదాపు రూ. 7-7.5 కోట్లు గల్లంతయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే అధికారిక లెక్కలు ఇంకా వెలువడలేదు. కాగా, రెండు రోజుల క్రితం సిట్ తమ ప్రాథమిక నివేదికను యూపీ సర్కారుకు సమర్పించింది. అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ కూడా ఉన్నారు. దీంతో నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు.




**సమయం ప్రతినిధి:** అయోధ్య రామమందిర విరాళాల అపహరణ కుంభకోణంపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘాటుగా స్పందించారు. 'సనాతన ధర్మం, కోట్ల మంది ప్రజల నమ్మకానికి అయోధ్య ఒక పవిత్రమైన చిహ్నం. అటువంటి పవిత్రమైన నమ్మకంతో ఆడుకోవాలని చూసే లేదా దానికి విఘాతం కలిగించే ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. యూపీలోని దేవరియాలో జరిగిన ఓ బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, మందిర విరాళాల వివాదంలో జరిగిన తాజా అరెస్టులను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల మతపరమైన సెంటిమెంట్లతో, నమ్మకాలతో చెలగాటమాడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

### SIT నివేదికతో రంగంలోకి పోలీసులు.. చర్యలు ప్రారంభం

ఈ విరాళాల దుర్వినియోగం వ్యవహారంపై వెల్లువెత్తిన ఆరోపణలను తేల్చేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ గతంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇన్వెస్టిగేషన్ ద్వారా నిజా నిజాలు పూర్తిగా వెలుగులోకి వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాజాగా SIT బృందం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో, పోలీసులు పక్కా ఆధారాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన ఎనిమిది మంది నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితులను పోలీసులు ప్రస్తుతం తమ ఆధీనంలోకి తీసుకుని, ఈ భారీ నిధుల మళ్లింపు వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు లోతుగా విచారిస్తున్నారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని శిల్పకళా వేదికలో ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "సే నో టు డ్రగ్స్" అవగాహన కార్యక్రమంలో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈగల్ ఫోర్స్, తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ద్వారా డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలతో పాటు విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సినీ ప్రముఖులు, క్రీడాకారులు కలిసి యువతలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. సినీ నటుడు రామ్ పోతినేని, నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ



భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మహిళా-శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రీన్ యూరియా ఉత్పత్తికి కేంద్రం ముందడుగు



**న్యూఢిల్లీ, (సమయం ప్రతినిధి):** దేశంలో పర్యావరణహిత ఎరువుల తయారీకి కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారంగా గ్రీన్ యూరియా ప్లాంట్ల స్థాపనకు ఎరువుల శాఖ ప్రీ-ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ప్రీ-ఈఓఐ) సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా తయారీ సంస్థలు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద ఏడాదికి 7.24 లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీన్ అమోనియా ఉత్పత్తి వ్యయం ప్రస్తుతం సాధారణ గ్రే అమోనియాతో పోలిస్తే అధికంగా ఉండటంతో, ఆ ధరల వ్యత్యాసాన్ని ఎరువుల శాఖ సబ్సిడీ రూపంలో భరించనుంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) గ్రీన్ అమోనియాను కొనుగోలు చేసి, సాధారణ మార్కెట్ ధరలకు ఎరువుల తయారీ సంస్థలకు సరఫరా చేయనుంది. గ్రీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ రూ.19,744 కోట్ల నిధులను వినియోగించనుంది. గ్రీన్ యూరియా ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు 10 సంవత్సరాలపాటు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని పుడిమడక వద్ద ఏర్పాటు చేస్తున్న రోజుకు 150 టన్నుల సామర్థ్యమున్న గ్రీన్ యూరియా పైలట్ ప్లాంట్‌ను ఆదర్శంగా తీసుకుని సాంకేతిక అంశాలపై చర్చించారు. ఈ ప్రాజెక్టులో గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ క్యాప్చర్ అండ్ యుటిలైజేషన్ సాంకేతికతలను వినియోగిస్తున్నారు. భారత్ 2070 నాటికి నెట్-జీరో ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవడంలో గ్రీన్ యూరియా ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దేశం ఏటా సుమారు ఒక కోటి మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, కొత్త గ్రీన్ యూరియా ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ఎరువుల రంగంలో స్వయం సమృద్ధితో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరుతో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆ వెంటనే సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రాష్ట్ర పరిపాలనపై ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, 2014 అక్టోబర్ నెలలో డిప్యూటేషన్ పైన కేంద్ర సర్వీసుకు వెళ్లిన సంజయ్ జాజు.. 2018, మార్చి వరకు ఎన్‌హెచ్ఐడీసీఎల్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం.. కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి మాతృ రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

# సంపాదకీయం

## ఫిరాయింపులు: భలే ఖరీదైన బేరాలు!

కాల వైపరీత్యం! నిన్నటిదాకా తాము విమర్శించిన పార్టీలోనే నేడు చేరిపోతున్న ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల బెంగాల్, మహారాష్ట్రలో చోటుచేసుకున్న తృణమూల్ కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యే, ఎంపీల ఫిరాయింపులే అందుకు నిదర్శనాలు. ఎటువంటి సంకోచాలు లేకుండా.. చేరిన క్షణమే, ఆ పార్టీ నాయకులతో బహిరంగంగా, చాలా కాలం తరువాత కలుసుకున్న పాత మిత్రుల్లా వ్యవహరిస్తున్నారు! ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదు! నిజానికి ఫిరాయింపులు అనేవి కొత్త రాజకీయ పరిణామాలు కానేకావు. భారతదేశ రాజకీయాలలో పార్టీ ఫిరాయింపులకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ నీతిబాహ్య రాజకీయాల పట్ల ఇప్పుడు ప్రజల్లో ఎటువంటి పట్టింపు లేకపోవడమే దిగ్భ్రాంతికరం. ఫిరాయింపులకు పాల్పడినవారు తమను ఎన్నుకున్న ఓటర్లకుగానీ, విశాల ప్రజానీకానికిగానీ తమ నిర్ణయంపై ఎటువంటి వివరణ ఇవ్వడం లేదు. రాజకీయాలు వ్యాపార లావాదేవీల వ్యవహారమయ్యాయి. ఫిరాయింపుదారులకు, వారిని చేర్చుకున్న పార్టీకి మధ్య కుదిరిన ఒప్పందానికి షరతులు ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు. రాజ్య వ్యవస్థ ఆర్థిక వనరులు అందుబాటులో ఉండడమనేది కూడా సదరు ఒప్పందంలో భాగంగా ఉంటోంది. ఇటీవల పార్టీ ఫిరాయించిన శివసేన ఎంపీ ఒకరు ఇలా చెప్పారు: 'నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించుకోవాలంటే నేను పార్టీ మారడం తప్పనిసరి'. ఫిరాయింపులను ప్రజల తీర్పును వంచించడంగా ఎవరూ ఇంకెంత మాత్రం భావించడం లేదు. అవి సాధారణ వ్యవహారాలైపోయాయి. అధికార సాధనకు ఫిరాయింపులూ మరొక మార్గమని ప్రజలు అంగీకరిస్తున్నారు! ఫిరాయింపులపై విమర్శలకు బీజేపీ మద్దతుదారులు అదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు: కాంగ్రెస్ విషయమేమిటి? దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఫిరాయింపులు జరగలేదా? 'ఆయారామ్, గయారామ్' అనే పరిహాసం ప్రాచుర్యంలోకి వచ్చింది నరేంద్ర మోదీ అధికారంలోకి రావడానికి చాలా కాలం ముందే కాదూ? 'అవును' అనేదే పై ప్రశ్నలన్నిటికీ సమాధానం. ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యమంత పాతవి. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బర్తరఫ్ చేశారు. పదవుల కోసం పార్టీ మారిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయ అవకాశవాదం బాగా వర్ధిల్లింది. నాయకులు పార్టీలు మారడంపై విమర్శలు రావడం పరిపాటి. అయితే ఆ విమర్శలకు పాలకపక్షం వారు ప్రతిస్పందిస్తూ 'గతంలో మీరూ అదే చేశారు కదా' అని పాత విషయాలను బయటకు తీసి ఎత్తిపొడవడం కూడా అంతే పరిపాటి. నాయకులు పార్టీలు మారడం అనేది కొత్తేమీ కాదు. ఇప్పుడు అసలు సమస్యేమిటంటే ఆ ఫిరాయింపుల స్వభావం పూర్తిగా మారిపోవడమే. కాంగ్రెస్ హయాంలో ఆధిపత్య పార్టీ వ్యవస్థకు తార్కాణంగా ఫిరాయింపులు ఉండేవి. ఇప్పుడు ఒక సర్వాధిపత్య పార్టీని సృష్టించి సుస్థిరం చేసే వ్యూహంలో భాగంగా ఫిరాయింపులు జరుగుతున్నాయి. నాటి నేటి ఫిరాయింపులలో ఈ వ్యత్యాసం సమకాలీన రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మార్పును వివరిస్తుంది. గత దశాబ్దకాలంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా ఆవిర్భవించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదొక అపూర్వమైన విషయమే, సందేహం లేదు. సంస్థాగత బలం, ఆర్థిక వనరులు, కమ్యూనికేషన్ సాధనాలు, నాయకత్వ నిర్మాణం మొదలైన అంశాలలో ఈ బీజేపీకి సమస్థాయి పార్టీ మరేదీ లేదు. ఎన్నికలలో బీజేపీ సాధిస్తున్న అప్రతిహత విజయాలకు ఆ శక్తి సామర్థ్యాలే కారణమని అంగీకరించవలసి ఉన్నది. అయితే ఆ ఘన విజయాలు ఒక కొత్త రాజకీయ తర్కాన్ని కూడా సృష్టించాయి. ఎన్నికల్లో విజయం సాధించడం ఇంకెంత మాత్రం అధికారంలో కొనసాగేందుకు ఒక మార్గం కాదు. దేశవ్యాప్తంగా సమస్త ఎన్నికలలోనూ విజయం సాధించడమే బీజేపీకి లక్ష్యంగా మారింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు ఫిరాయింపులు కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కాదు, అవి పార్టీలను స్వాధీనపరచుకునే వ్యూహాలు. ఫిరాయింపులు జరిగిన పద్ధతిని చూడండి.. జ్యోతిరాదిత్య సింధియా, ఆయన విధేయులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించిన తరువాత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మహారాష్ట్రలో శివసేన తొలి చీలికను చవిచూసింది. ఆ తరువాత ఎన్సీపీ చీలిపోయింది. ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, శాసనసభ్యులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ అక్కడ క్రమంగా విస్తరించింది. ఇప్పుడు పలు ఈశాన్య రాష్ట్రాలలో అధికారంలో ఉన్నది. శాసనసభలలో సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కంటే ప్రత్యర్థి పార్టీలను అన్ని విధాలా దెబ్బతీయడమే బీజేపీ అసలు లక్ష్యం. భవిష్యత్తులో తనకు ఏ విధమైన సవాళ్లూ రాకుండా ఉండేందుకు బీజేపీ చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల విధేయత పరిపూర్ణంగా ఉన్న పార్టీ తమది అని ఒకప్పుడు సగర్వంగా చెప్పుకున్న బీజేపీ, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున చేర్చుకుంటున్నది. భారతీయ జనతా పార్టీ నిజానికి 'భర్తీ జనతా పార్టీ' అని పలువురు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఈ పరిహాసంలో సత్యం ఉన్నది. వాజపేయి నాయకత్వంలో బీజేపీ ఇతర పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలు, ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా విస్తరించింది. ప్రజలను ఒప్పించడం ద్వారానే రాజకీయ విస్తరణ సాధ్యమని వాజపేయి విశ్వసించారు. అయితే మోదీ–షాల నేతృత్వంలోని బీజేపీ రాజకీయ విస్తరణకు ఎమ్ అండ్ ఏ (మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్) నమూనాను అనుసరిస్తోంది. నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం, కొన్ని సందర్భాలలో పార్టీలకు పార్టీలనే కలుపుకోవడం ద్వారా విస్తరిస్తోంది. వాజపేయి, మోదీ నమూనాలు రెండిటికీ పార్టీ పెరుగుదలే లక్ష్యం. అయితే అందుకు అనుసరించిన పద్ధతులు మౌలికంగా భిన్నమైనవి. రాజకీయవేత్తలు సాధారణంగా విజయవంతమైన పార్టీల వైపు ఆకర్షితులవుతారని బీజేపీ మద్దతుదారులు వాదిస్తారు. ఈ వాదన నిస్సందేహంగా నిజమే. అయితే ఇది ఒక రాజకీయ శూన్యంలో సంభవించడం లేదు. మోదీ సర్కార్ తమ నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతుందని, ఆర్థిక ఒత్తిళ్లకు లోనుచేస్తుందని, విధేయతలు మార్చుకున్నవారికి ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న విపక్ష నాయకులు బీజేపీలో చేరితే వారికి ఆ పార్టీ చట్టం నుంచి రక్షణ కల్పిస్తుందనే భావన ప్రజలలో నెలకొనడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల, రాజ్యాంగ వ్యవస్థల నిష్పాక్షికత పైనే కాకుండా ఆ నిష్పాక్షికతపై ప్రజల పరిపూర్ణ నమ్మకంపై కూడా ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడ ఆధారపడి ఉన్నది. అయితే ఇప్పుడు ఆ సంస్థల, వ్యవస్థల నిష్పాక్షికతలో ప్రజల విశ్వాసం హరించుకుపోతోంది. ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని చాలా తెలివిగా ఉల్లంఘించడం జరుగుతోంది. ఇటీవల బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురకు చెందిన ఒక అనామక పార్టీలో చేరడమే అందుకొక నిదర్శనం. న్యాయవ్యవస్థ సైతం ఫిరాయింపుల వ్యతిరేక కేసులలో నిర్ణయం తీసుకోవడంలో చేస్తున్న జాప్యం ఆ అక్రమ చర్యలను నిరోధించడానికి దోహదం చేయడం లేదు. పౌరులు ఓటు వేసినప్పుడు ఒక అభ్యర్థిని తమ ప్రతినిధిగా ఎన్నుకోవడమే కాకుండా ఒక రాజకీయ పార్టీని, దాని ప్రణాళికను అంగీకరిస్తున్నారు. పాలనకు దిశా నిర్దేశంగా ఒక రాజకీయ దార్శనికతను ఆమోదిస్తున్నారు. మరి ఎన్నికల అనంతరం గెలిచినవారి ఎత్తుగడలు పౌరుల అభీష్టాన్ని వమ్ము చేస్తున్నాయి. ఇది న్యాయమేనా? రాజకీయ పునరేకీకరణలకు వ్యతిరేకంగా చేస్తున్న వాదన కాదు ఇది. పార్టీల ప్రాధాన్యాలు మారుతుంటాయి. నాయకులు తమ అభిప్రాయాలను తరచూ మార్చుకుంటుంటారు. సైద్ధాంతిక విశ్వాసాలతో కాకుండా అధికార లాలసతో ఫిరాయింపులు మామూలు వ్యవహారమయినప్పుడు ప్రజాస్వామ్యం భావాల సంఘర్షణకు ఆస్కారమివ్వదు; రాజకీయ ఆస్తుల విపణిగా పరిణమిస్తుంది.

# జల రాజకీయాలతో రాష్ట్రాల మధ్య చిచ్చు!

(సమయం ప్రతినిధి): మహానది--గోదావరి నదుల అనుసంధానం, గోదావరి–కావేరి లింక్ ప్రాజెక్టుల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కేవలం రాజకీయలబ్ధి కోసం భయాందోళనలు సృష్టించడం సరైనది కాదు ('నదుల అనుసంధానం... తెలంగాణ హక్కులకు విఘాతం'– 13.06.2026). నదుల అనుసంధానం అనేది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి ప్రణాళిక. ఇది కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాదు, దేశవ్యాప్త జలవనరుల నిర్వహణలో భాగం.

మహానది--గోదావరి అనుసంధానం కేవలం రెండు నదుల కలయిక కాదు. అది దేశ జల భద్రతకు, వ్యవసాయాభివృద్ధికి, ప్రాంతీయ అసమానతల నివారణకు పునాది వేసే మహత్తర జాతీయ యజ్ఞం. వరద నీటిని వృథా కాకుండా వినియోగంలోకి తేవడం, కరువును తగ్గించడం, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. రాజకీయ భేదాలకు అతీతంగా కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేస్తే మహానది నుంచి గోదావరికి ప్రవహించే జలధారలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయి. గోదావరి–కావేరి లింక్ ప్రాజెక్టును 'ఏపీ కుట్ర'గా, తెలంగాణకు 'జలద్రోహం'గా చిత్రీకరించే ప్రయత్నం చేయడం హరీశ్‌రావు దివాలాకోరు రాజకీయానికి నిదర్శనం. గోదావరి–కావేరి అనుసంధానం అనేది నిన్న మొన్నటి ఆలోచన కాదు. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న జాతీయ జల విధానంలో భాగం. సముద్రంలో వృథాగా కలిసిపోతున్న మిగులు జలాలను నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తరలించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో ఆంధ్రప్రదేశ్ ఒక్క రాష్ట్రం నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలు, జలవనరుల నిపుణులు, ట్రిబ్యునళ్ల నిర్ణయాలు, చట్టబద్ధ అనుమతులు ఉంటాయి.

తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత. అట్లాగే ఆంధ్రప్రదేశ్ తనకు చట్టబద్ధంగా దక్కిన జలాలను వినియోగించుకోవడం కూడా ఆ రాష్ట్ర హక్కు. నదీ జలాల విషయంలో హక్కులు, చట్టాలుంటాయి తప్ప, ఆరోపణలు కాదు. ప్రతి ఏడాది 3,000 టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయి. ఆ నీటిని సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించుకోవాలని కేంద్రంతో సహా అన్ని రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయి. అలాంటి ప్రయత్నాన్ని ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా చలి కాచుకొనేందుకు ఉపయోగించుకోవాలని హరీశ్‌రావు ప్రయత్నం. ప్రజలకు జల యుద్ధం కాదు, జల ప్రయోజనం కావాలి. జలాలపై అగ్ని జ్వాలలు రాజేయడం సులభం, కానీ జలాలను రైతుల పొలాల్లోకి తీసుకురావడమే నిజమైన నాయకత్వం! కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ వంటి ప్రాజెక్టులకు గోదావరి జలాల వినియోగ హక్కులను తెలంగాణ ఇప్పటికే పొందింది. కావేరి– గోదావరి లింక్ వల్ల తెలంగాణ వాటాలో ఒక్క చుక్క నీరు కూడా తగ్గదని కేంద్ర సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని అంటున్న హరీశ్‌రావు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి: తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య పెరిగిన జల వివాదాలకు మీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం ఎందుకు చూపలేదు? వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలిసిపోతే తెలంగాణకు లాభమా? రైతుల పొలాలకు చేరితే నష్టమా?

మిగులు జలాలను సద్వినియోగం చేసి రైతులకు, తాగునీటికి, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించడం నిజమైన జల విధానం. రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులను ప్రాంతీయ విద్వేషాలతో అడ్డుకోవడం కాదు. తెలంగాణా ప్రభుత్వం గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటే నిర్మించింది. ఇంకా, గోదావరిపై ఇచ్చంపల్లి ప్రాజెక్టు కూడా నిర్మించినట్లయితే 85 టీఎంసీల నీటిని తెలంగాణ వాడుకోవచ్చు. దాని ద్వారా వచ్చే 330 టీఎంసీలు పవర్ ప్రాజెక్టు కోసం డిజైన్ చేశారు. ఈ నీటిని కృష్ణాతో అనుసంధానం చేసుకోవచ్చు. తెలంగాణలో కరువు అంటూ ఉండదు. ఇప్పటి ప్రభుత్వం అయినా ఈ ప్రాజెక్టుపై ఆలోచన చేయాలి. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత కూడా సెంటిమెంట్‌ను రగిలించడమే లక్ష్యంగా కేసీఆర్ కుటుంబం జల రాజకీయం చేస్తోంది. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలనే దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ వాడుకుంటాం అంటుంటే తెలంగాణకు వచ్చిన నష్టం ఏమిటో అర్థం కావడం లేదు. వృథాగా పోతున్న గోదావరి నీళ్లను తరలించడం ద్వారా పల్నాడు, రాయలసీమ, వెలిగొండ, ప్రకాశం జిల్లాల సాగునీటి కష్టాలు తీర్చి, రాయలసీమను కరువు రక్కసి నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నం చేస్తున్నారు. అట్లాగే గోదావరి నుంచి 200 టీఎంసీలు నల్లమల ప్రాజెక్టుకు తరలించడం ద్వారా కృష్ణా నీటిపై ప్రెషర్ తగ్గుతుంది. ఆ నీటిని తెలంగాణాకు కూడా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. కానీ, ఇవేవీ హరీశ్‌రావుకు అవసరం లేదు. తెలంగాణలో ప్రస్తుతం జీరోగా మారిన కేసీఆర్ కుటుంబం చంద్రబాబును బూచిగా చూపెట్టి రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నది. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ఉపయోగించుకోగా మిగిలిన నీరు మాత్రమే కిందకు పోతుందన్న ఇంగితం కూడా లేకుండా హరీశ్‌రావు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఇక మానుకోవాలి.

# ఢిల్లీలో తెలంగాణకు స్థలం కరువు

హైదరాబాద్ : దేశ రాజధానిలో తెలంగాణకు కేరాఫ్ లేకుండా పోతోందా? ప్రస్తుతం ఏపీ మంచితనం మీద ఆధారపడాల్సి వస్తోందా? వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని తెలంగాణ అధికారులు కంగారు పడుతున్నారా? ఏ విషయంలో అంత టెన్షన్ పడుతున్నారు? రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ళ తర్వాత కూడా ఆ సమస్యలు ఎందుకు వస్తున్నాయి? ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిర్మాణానికి అడ్డుపడుతున్నదేంటి? ఢిల్లీలో తెలుగోళ్ళకు కేరాఫ్ ఆంధ్ర భవన్. సెంట్రల్ ఢిల్లీలో అదీ, ఇండియా గేట్‌కు అత్యంత దగ్గరగా ఉన్న ఈ బిల్డింగ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగింది. అయితే విభజన తర్వాత ఆస్తుల పంపకాల్లో భాగంగా ఆంధ్ర భవన్ ను తాత్కాలికంగా విడగొట్టుకుని ఒకే బిల్డింగ్‌లో రెండు రాష్ట్రాలు అడ్మినిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఢిల్లీలోని ఈ భవన్‌ను చూస్తే గమ్మత్తుగా కనిపిస్తోందని అంటుంటారు చాలామంది. దీనికి ఒకవైపు ఆంధ్ర , మరో వైపు తెలంగాణ అని పక్క పక్కనే బోర్డ్స్ కనిపిస్తూ ఉంటాయి. పైగా రెండు రాష్ట్రాల ఢిల్లీ భవన్స్ ఒకే బిల్డింగ్‌లో ఉండడంతో వాళ్ళని వీళ్లు, వీళ్లని వాళ్ళు? మెయింటెనెన్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో ఘనంగా చెప్పుకోవాల్సిన ఆంధ్ర, తెలంగాణ భవన్లు ప్రస్తుతం గందరగోళంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సెక్రటేరియెట్‌కు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో, ఢిల్లీలో ఉండే రాష్ట్రాల భవన్లకు అంత ఇంపార్టెన్స్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా? ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లు, ప్రోటో కాల్ అధికారులు ఉంటారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఢిల్లీ ట్రిప్‌కు వచ్చినప్పుడు భవన్లోనే బస చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక, భవన్ విభజనపై క్లారిటీ వచ్చింది, పంపకాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ మొత్తం ఆంధ్ర వాటా కింద వెళ్ళింది. ఆ ఒప్పందం ప్రకారం పటౌడీ హౌజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ భవన్ నిర్మాణం జరగాలి.కానీ? నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తోంది. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ భవన్ కొనసాగుతోంది. ఇది ఇలాగే ఉంటే ఏదో ఒకరోజున ఆంధ్ర వాళ్ళు ఖాళీ చేసి పొమ్మంటే మా పరిస్థితి ఏంటంటూ తెలంగాణ అధికారులు టెన్షన్ పడుతున్నారట.

ఢిల్లీ భవన్ విభజన తర్వాత ఏపీకి 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలను కేటాయించారు, విభజన ప్రక్రియ మొత్తం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు ఉన్న స్థలం 19.7 ఎకరాలు. దాని విలువ 9వేల 913.505 కోట్లు ఉంటుంది. ఇది కూడా కేంద్ర హోంశాఖ చెప్పిన లెక్క. వాస్తవానికి ఢిల్లీలో బహుళ అంతస్తుల నిర్మాణం కట్టాలంటే ప్రాసెస్ చాలా పెద్దది. మొదట ప్లాన్ రెడీ చేసి అనుమతులను కేంద్రం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం ఇప్పటికే ప్లాన్ సిద్ధం చేసుకున్న తెలంగాణ సర్కార్ నిధులు కేటాయించి.. నిర్మాణం కోసం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ? ఆ విషయంలో ఆలస్యం అవుతోంది. దాంతో? దేశ రాజధానిలో రాష్ట్రానికి కేరాఫ్‌గా నిలవాల్సిన భవనం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. రాష్ట్రం నుంచి వచ్చే రాజకీయ నాయకులకు, అధికారులకు , సామాన్యులకు , టూరిస్టులకు కూడా ఇబ్బంది కలుగుతోంది.. మరోపక్క ఏపీ ప్రభుత్వం మాత్రం తన వాటాలోని 11.5 ఎకరాల్లో రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. అందుకోసం ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది కూడా. వాళ్ళు వెళ్ళిపొమ్మని ఖాళీ చేయించే పరిస్థితి రాకముందే తెలంగాణ భవన్‌కు పునాదులు వెయ్యాలని కోరుకుంటున్నారు ఇక్కడి అధికారులు.

## తెలుగు ఎంపీలే రిచ్చెస్ట్

హైదరాబాద్ : అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువలో తెలుగు రాష్ట్రాల ఎంపీలదే పైచేయిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 226 మంది సిట్టింగ్ ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 మంది ఎంపీల సంపదే 39.39 శాతం అంటే రూ. 10,259 కోట్లు ఉండటం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల ఆస్తులు రూ. 8,310 కోట్లుగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ. 5300 కోట్లతో దేశంలోనే అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. అలాగే తెలంగాణ ఎంపీల్లో 71 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.భారత పార్లమెంట్ ఎగువసభ అయిన రాజ్యసభలో తెలంగాణ ప్రజాప్రతినిధుల హవా నడుస్తోంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ దేశవ్యాప్తంగా ఉన్న 226 మంది సిట్టింగ్ రాజ్యసభ ఎంపీల ఆర్థిక, నేర, ఇతర నేపథ్యాలపై తాజాగా విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తులతో పోలిస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది ఎంపీల వాటాయే ఏకంగా 39.39 శాతంగా నమోదైంది. ఈ మొత్తం సంపదలోనూ ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ ఎంపీల ఆస్తులే ఎక్కువ.మొత్తం 226 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో కేవలం తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల సంపదే ఏకంగా రూ. 8,310 కోట్లుగా ఉంది. అంటే దేశవ్యాప్త ఎంపీల మొత్తం ఆస్తిలో దాదాపు మూడో వంతు వాటా తెలంగాణ ప్రజాప్రతినిధులదే కావడం గమనార్హం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,949 కోట్లుగా ఉంది. నివేదిక ప్రకారం తెలంగాణలో 57 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం మంది ఎంపీలు బిలియనీర్లుగా తేలారురాజ్యసభలో అత్యధిక ఆస్తులున్న తొలి ముగ్గురు ఎంపీలను పరిశీలిస్తే.. అందులో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే కావడం విశేషం. తెలంగాణ నుంచి బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న బండి పార్థసారథి రూ. 5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటి స్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజేందర్ గుప్తా రూ. 5,053 కోట్లతో రెండో స్థానంలో నిలవగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ రూ. 2,558 కోట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. తెలంగాణలో కేవలం ముగ్గురు బీఆర్ఎస్ సభ్యుల ఆస్తి విలువే రూ. 5,524 కోట్లుగా ఉందని ఏడీఆర్ స్పష్టం చేసింది.క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల జాబితాలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో ముగ్గురిపై అత్యంత తీవ్రమైన నేరాల కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఈ కేసుల పరంగా దేశంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల కంటే తెలంగాణే ముందంజలో ఉంది. తెలంగాణలో క్రిమినల్ కేసులున్న వారిలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీలు ఉన్నారు.దేశవ్యాప్తంగా వంద కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న ఎంపీలు 31 మంది ఉండగా.. అందులో బీజేపీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్ నుంచి ఇద్దరేసి, జనసేన నుంచి ఒకరు ఈ వంద కోట్ల క్లబ్‌లో ఉన్నారు. పార్టీల పరంగా చూస్తే.. దేశవ్యాప్తంగా బీజేపీ ఎంపీల ఆస్తుల విలువ రూ. 8,181 కోట్లు కాగా.. కాంగ్రెస్ సభ్యులది రూ. 3,781 కోట్లుగా ఉంది. నలుగురు స్వతంత్రుల కు రూ. 2,211 కోట్ల ఆస్తులున్నాయి. ఏపీలో టీడీపీకి చెందిన నలుగురు ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,007 కోట్లు కాగా.. వైసీపీకి చెందిన నలుగురు సభ్యులకు రూ. 683 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. అప్పుల విషయానికి వస్తే.. రాజ్యసభలో అత్యధిక అప్పులున్న తొలి ముగ్గురు ఎంపీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీ భాష్యం రామకృష్ణ రూ. 200 కోట్ల అప్పులతో రెండో స్థానంలో నిలిచారు. ఆయన మె?త్తం ఆస్తులు రూ. 672 కోట్లు. ఝార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్‌నత్వానీ రూ. 256 కోట్ల అప్పులతో మొదటి స్థానంలో.. జయాబచ్చన్ రూ. 149 కోట్ల అప్పులతో మూడో స్థానంలో ఉన్నారు.

## రేపటి నుంచి జులై 2 వరకు వర్షాలు.. తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 27వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది.

మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.

# మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం






## అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్

**జడ్చర్ల, (సమయం ప్రతినిధి):** మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్లలోని మినీ స్టేడియం నుంచి నేతాజీ చౌరస్తా వరకు జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 1,500 మంది విద్యార్థులు, యువత, మహిళలు, అధికారులు, వాకర్స్, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక శాపమని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండి యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్–ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు "ఐ యామ్ యాన్ యాంటీ డ్రగ్ సోల్జర్" సెల్ఫీ స్టాండ్ వద్ద విద్యార్థులు, ప్రజలు ఫోటోలు దిగుతూ డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని చాటిచెప్పారు. నేతాజీ చౌరస్తా వద్ద ఎస్పీ అందరితో మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంలో విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి డ్రగ్స్ నిర్మూలనకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్, యోగా, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పరిశీలించిన అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్ గ్రామం, దేవరకద్ర మండల కేంద్రం, కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి గ్రామం, చిన్నచింతకుంట మండల కేంద్రం, అడ్డాకల్ మండల కేంద్రం, మూసాపేట్ మండలంలోని కోమిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత మండలాల తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్వైజర్లతో సమావేశమై సవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**బూత్ స్థాయి అధికారికి పత్రాలు అందజేసి నమోదు దరఖాస్తు సమర్పణ**



దేవరకద్ర, (సమయం ప్రతినిధి): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలోని తన స్వగృహానికి వచ్చిన బూత్ స్థాయి అధికారికి అవసరమైన వివరాలు, సంబంధిత పత్రాలు అందజేసి నమోదు దరఖాస్తును సమర్పించారు. అనంతరం బూత్ స్థాయి అధికారితో మాట్లాడిన ఆల వెంకటేశ్వర్ రెడ్డి, క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలు తీరును, ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసేలా ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.


## ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను విజయవంతం చేయాలి

**గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం వనపర్తిలో భారీ ర్యాలీ**



**వనపర్తి, (సమయం ప్రతినిధి):** గిరిజనులకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ఇందిరమ్మ ఆశీర్వాద" స్వర్ణోత్సవ బస్సు యాత్ర శనివారం వనపర్తి నియోజకవర్గానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఉదయం 9 గంటలకు భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాలు, తాండాల నుంచి గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, మార్కెట్ యార్డు, సహకార సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి, మహిళా విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు బాంధవుడు ద్యాప గోపాల్ రెడ్డి ఆదర్శాలు భావితరాలకు స్ఫూర్తి



(సమయం ప్రతినిధి): ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసి, ప్రజా ప్రయోజనాల కోసం కుటుంబ ఆస్తులను సైతం త్యాగం చేసిన రైతు బాంధవుడు శ్రీ ద్యాప గోపాల్ రెడ్డి గారి ఆదర్శాలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత. మిడ్జిల్ మండలంలోని గుడిగాన్‌పల్లిలో 1926 జూన్ 28న జన్మించిన ద్యాప గోపాల్ రెడ్డి, కల్వకుర్తి సమితి అధ్యక్షుడిగా, కల్వకుర్తి శాసనసభ్యునిగా, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ప్రజలకు నిస్వార్థ సేవలందించి గొప్ప ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారు. జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా వేలాది మంది రైతులకు వ్యవసాయ రుణాలు, ట్రాక్టర్లు మంజూరు చేసి "రైతు బాంధవుడు"గా పేరుపొందారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసి పేద విద్యార్థులకు విద్యను చేరువ చేశారు. అంతేకాకుండా, జిల్లాలోని అర్హులైన విద్యావంతులను ఉపాధ్యాయులుగా నియమించి అనేక నిరుద్యోగ కుటుంబాల్లో ఆశాజ్యోతి నింపారు. నీతి, నిజాయితీ, ప్రజాహితం ఆయన ప్రజా జీవితానికి మూల సూత్రాలుగా నిలిచాయి. పేదల పెన్నిధిగా నిలిచిన ద్యాప గోపాల్ రెడ్డి గారి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నాము.

# లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుతో ఆకర్షితులై కాంగ్రెస్‌లో భారీ చేరికలు

**బీఆర్ఎస్‌కు గుడ్‌బై.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఉప సర్పంచ్ నరసింహులు, పలువురు నాయకులు**




షాద్‌నగర్, (సమయం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా చేగిరెడ్డి ఘనపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ ఎరుకల నరసింహులు, వార్డు సభ్యులు, పలువురు గ్రామ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఎరుకల నరసింహులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం తమను ఆకర్షించిందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో ప్రజాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రాజకీయాల కంటే ప్రజల అభివృద్ధే ముఖ్యమని తాను విశ్వసిస్తున్నానన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ భేదాలు సహజమే అయినప్పటికీ, ఇప్పుడు ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, సర్పంచ్‌లు శివమౌళి, రాంచంద్రయ్య, సత్యనారాయణ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ ఎరుకల నరసింహులు, మాజీ ఉప సర్పంచ్ రాములు, వి. నరసింహులు, వెంకటమ్మ, వి. కుమార్, యు. యాదయ్య, సి. నరసింహులు, సి. యాదయ్య, లక్ష్మన్, ఎన్. మహేందర్, ఈ. సత్తయ్య, రామకృష్ణ, యాదగిరి, మంజుల, శ్రీను, వి. రాములు, ఈ. యాదయ్య, వి. వెంకటయ్య, గణేష్, విఘ్నేష్, నంగి శేఖర్, తరుణ్, రవి, సాయిలు తదితరులు ఉన్నారు.

# సైబర్ టవర్స్ ఇక చరిత్రే

హైదరాబాద్ : హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థ ఇదే కావడం విశేషం. ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అప్పట్లో అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యంత అనువుగా.. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫెయిర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి. నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం.. నేడు లక్షల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.


## భీముడు (సరోజ) నాయక్‌కు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నివాళి



**మహబూబాబాద్, (సమయం ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామానికి చెందిన గంగావతు భీముడు (సరోజ) నాయక్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సింగారం గ్రామానికి చేరుకున్న ఆమె భీముడు (సరోజ) నాయక్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ఓదార్పునిచ్చారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని భీముడు (సరోజ) నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు.







# విద్య, ఆరోగ్యం, గృహాల అభివృద్ధిపై ప్రభుత్వ దృష్టి : ప్రభుత్వ విప్

(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : ప్రజల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు మరియు గ్రామీణ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి తెలిపారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం లోని మాచన్ పల్లి గ్రామాల్లో బీరప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ఎస్డీఎఫ్ నిధులు ముడా నిధులతో నిర్మించిన బీరప్ప స్వామి దేవాలయ మండపాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడిన ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పిల్లల విద్య గృహాల నిర్మాణం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే సమయానికి వైద్యం అందించాల్సిన అవసరం ఉందని, ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అదే సమయంలో పిల్లలు చదువులో మెరుగైన స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించడం, విద్యార్థులకు పోషకాహారం అందించడం వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడం వల్ల విద్యార్థుల హాజరు పెరిగిందని ఆయన చెప్పారు. సాంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలు కూడా



తమ పిల్లలను ఉన్నత విద్య వైపు దారి చూపించాలని ఆయన సూచించారు. "పిల్లలు కేవలం పాత వృత్తులకే పరిమితం కాకుండా, ఉన్నత చదువులు పూర్తి చేసి మంచి ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఎదగాలి" అని పేర్కొన్నారు. అవసరమైతే పెద్ద స్థాయిలో ఆధునిక పద్ధతులతో వ్యాపారాలు చేయాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధిలో భాగంగా ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పెన్షన్లు అందించడమే కాకుండా, ప్రజలు స్వయం ఉపాధి ద్వారా స్థిరంగా ఎదగాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇక గృహ నిర్మాణంపై మాట్లాడుతూ, గ్రామాల్లో గుడిసెలు, పెంకుటిల్లు లేకుండా ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో 25 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, తాజాగా మరో 50 మంది దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. అర్హులైన అందరికీ త్వరలో గృహ నిర్మాణానికి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో ప్రజలు తమ ఇష్టానికి అనుగుణంగా ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా గ్రామాల్లో నిర్మాణ రంగం కూడా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. "ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే మా లక్ష్యం" అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గొర్రెల కాపరులు సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, మాచన్ పల్లి గ్రామ సర్పంచ్ మన్యంకొండ, పోతన్ పల్లి గ్రామ సర్పంచ్ మాధవ రెడ్డి, రామచంద్రాపురం గ్రామ సర్పంచ్ బాబురావు , మాచన్ పల్లి ఉపసర్పంచ్ కృష్ణయ్య , నాయకులు సాయిలు యాదవ్, భాస్కర్ రెడ్డి, గోవింద్ యాదవ్, నర్సింహులు యాదవ్, సాయిలు, శ్రీశైలం, సత్యం మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి, (సమయం ప్రతినిధి): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ వేడుకల బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు మహిళ ఇందిరా గాంధీ హయాంలోనే 1976లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం బాటలు వేసిందని పేర్కొన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు విస్తృతంగా అందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కూడా గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గిరిజన ఆవాస ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రోత్సాహం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. ఇందిరమ్మ కాలం నుంచి గిరిజనులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని పేర్కొన్న ఆయన, శనివారం వనపర్తి జిల్లా కేంద్రానికి రానున్న ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ వేడుకల బస్సు యాత్రను విజయవంతం చేయాలని, పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజన నాయకులతో కలిసి బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో గిరిజన సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 29న మహబూబాబాద్‌కు కేటీఆర్.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



మహబూబాబాద్, (సమయం ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 29న మహబూబాబాద్‌కు రానున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, పార్టీ సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యా నాయక్ మాట్లాడారు. మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల పరిధిలో నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సభ్యత్వ నమోదు ప్రత్యేక కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రంగారావు, భరత్ కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, రావుల రవిచందర్ రెడ్డి, యళ్ళ మురళీధర్ రెడ్డి, ముత్యం వెంకన్న గౌడ్, తెల్ల శ్రీనివాస్, నాయని రంజిత్, మహబూబ్ పాషా, జెర్రిపోతుల వెంకన్న గౌడ్, మర్నేని వెంకన్న, మర్నేని రఘు, వెన్నమల్ల అజయ్, బొడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కాలనీలో బోర్‌వెల్ ప్రారంభించిన కౌన్సిలర్ అరుణ-జ్ఞానేశ్వర్

మహబూబాబాద్, (సమయం ప్రతినిధి): మహబూబాబాద్ మున్సిపాలిటీ 19వ వార్డు పరిధిలోని జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను సోమవారం కౌన్సిలర్ చిదిరాల అరుణ-జ్ఞానేశ్వర్ ప్రారంభించారు. జర్నలిస్టుల ఆహ్వానం మేరకు బోర్‌వెల్ వద్ద కొబ్బరికాయ కొట్టి, పసుపు-కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చిదిరాల అరుణ-జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి సేవ చేస్తున్న పాత్రికేయుల అవసరాలను తీర్చడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. జర్నలిస్టు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్‌వెల్ ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం జర్నలిస్టులు కౌన్సిలర్ దంపతులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రజా



సంక్షేమానికి కట్టుబడి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని కౌన్సిలర్ చిదిరాల అరుణ--జ్ఞానేశ్వర్ హామీ ఇచ్చారు.

## పామ్ రెడ్డి పల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



(సమయం ప్రతినిధి అమర చింత) : అమరచింత మండలం పామడ్డిపల్లి శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని CPM రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని మౌలిక వసతుల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థినిల మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జబ్బార్, సిపిఎం సీనియర్ నాయకులు మహమూద్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, మండల కార్యదర్శివర్గ సభ్యులు అజయ్, వెంకటేష్,టీ రాఘవేంద్ర సీపీఎం అమరచింత 7th వార్డు కౌన్సిలర్ మాధవి రాజేందర్, పాంరెడ్డిపల్లె ఉపసర్పంచ్ వేనెలమోహన్, శంకర్,రాజు,కర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ-రుక్మిణీ కళ్యాణం



మక్తల్, (సమయం ప్రతినిధి): మక్తల్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా శుక్రవారం శ్రీకృష్ణ-రుక్మిణీ కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ప్రజల సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు, మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యోదయ పథకంలో మార్పులు

వరంగల్ : దేశంలోని అత్యంత నిరుపేద కుటుంబాల ఆహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి 35 కిలోల బియ్యం లేదా గోధుమలను అందిస్తున్నారు. తాజాగా, ఈ పథకంలో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇకపై పేద కుటుంబాల్లోని సభ్యుల సంఖ్యను బట్టి రేషన్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికీ 7 కిలోలు చొప్పున ఇద్దరు ఉంటే 14 కిలోల ఇస్తారు. ఐదుగురు, ఆపై ఎక్కువ ఉంటే ప్రస్తుతం ఇచ్చే 35 కిలోలు కొనసాగుతాయి.అంత్యోదయ అన్న యోజన పథకంలో కేంద్రం కీలక మార్పులు తీసుకురానుంది. ఈ పథకం కింద లబ్దిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు అందజేసేలా మార్పులు చేయబోతోంది. ప్రస్తుతం ఉన్న 35 కిలోల గరిష్ఠ పరిమితిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను సవరించేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ.. జులై 13 వరకు గడువు విధించింది.

# మత్తును తరిమికొట్టేందుకు విద్యార్థులు-పోలీసుల సమిష్టి సంకల్పం

**మత్తుకు దూరంగా.. మానవత్వానికి దగ్గరగా అంటూ విద్యార్థుల నినాదాలు**
**గాంధీ చౌక్‌లో మానవహారంతో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ**
**ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఆత్మకూర్ పోలీసుల భారీ అవగాహన ర్యాలీ**





ఆత్మకూర్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి, సునిత రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూర్ ఆత్మకూరు సీఐ, శివ కుమారు, పర్యవేక్షణలో పర్యావేక్షణలో ఆత్మకూరు ఎస్సై, జయన్న ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులతో కలిసి గాంధీ చౌక్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి "డ్రగ్స్‌కు నో జీవితానికి యెస్", "మత్తుకు దూరం... భవిష్యత్తుకు చేరువ" వంటి నినాదాలతో పట్టణ ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌లో మానవహారం ఏర్పాటు చేసి, మాదకద్రవ్యాలను జీవితంలో ఎన్నటికీ చేరనివ్వబోమని, సమాజంలో కూడా వాటి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ససీఐ గారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు యువత జీవితాలను, కుటుంబాలను, సమాజ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారి. క్షణిక ఆనందం కోసం తీసుకునే ఒక తప్పు నిర్ణయం జీవితాంతం బాధను మిగులుస్తుంది. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక కార్యకలాపాలకు కేటాయించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. డ్రగ్స్ విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణా గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాము. 'డ్రగ్స్ రహిత సమాజం ఆరోగ్యవంతమైన యువత' అనే లక్ష్యంతో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. యువత తమ కలలను మత్తుకు బలి చేయకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తితో ముందుకు సాగితేనే సమాజం బంగారు భవిష్యత్తు వైపు పయనిస్తుంది. మాదకద్రవ్యాలకు 'నో' చెప్పి, జీవితానికి యెస్ చెప్పాలని ప్రతి విద్యార్థిని, ప్రతి యువకుడిని కోరుతున్నానని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సిఐ, శివకుమార్, ఆత్మకూరు ఎస్సై, జయన్న, ఎంవీ రామన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆత్మకూర్ పోలీస్ స్టేషన్, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

విజయవాడ : ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెత్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డెత్‌గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డెత్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెత్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్ట్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది.

## డబ్ల్యూజేఐ మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా కే. రవీందర్



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు కే. రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్ రాజు భాయ్ శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు ఆ సంఘానికి మూకుమ్మడిగా రాజీనామా చేసి డబ్ల్యూజేఐలో చేరిన అనంతరం జిల్లా అడ్‌హక్ కమిటీని రాష్ట్ర నాయకత్వం ఏర్పాటు చేసింది. కో-కన్వీనర్లుగా కృష్ణ మనోహర్ గౌడ్, అనిల్ కుమార్ ఆరగిద్ద, రవికుమార్, జంగం దిలీప్ కుమార్, సంయుక్త కన్వీనర్లుగా రాము, మిట్టమీది బాలరాజు, కొమ్ము దామోదర్, మేకల గోపాల్, సంఘటన కన్వీనర్‌గా కాడం రాఘవేందర్, ముఖ్య సలహాదారులుగా మహమ్మద్ రఫీ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, కే. వెంకటేష్, కిషన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్ రాజు భాయ్ మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్. రావు, హైదరాబాద్ నగర శాఖ అధ్యక్షుడు బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

హైదరాబాద్ : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 07:25 గంటలకు, ఏఎంబీ ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి నుండి హాఫీజ్పేట్ వైపు వెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్సైకిల్ హాఫీజ్పేట్ నుండి గచ్చిబౌలి వైపు రోడ్ రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్, వెనుక కూర్చున్న విట్టల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించారు. రాయల్ ఎన్ఫీల్డ్ రైడర్ వినోద్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం మేరకు సమీపంలో ఉన్న హాస్పిటల్ తరలించారు కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నమని తెలిపారు.

## ప్రజల మధ్యే మాజీ ఎమ్మెల్యే ఆల.. ఓటర్ల సవరణపై గ్రామాల వారీగా చైతన్యం





దేవరకద్ర, (సమయం ప్రతినిధి): దేవరకద్ర నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి క్షేత్రస్థాయిలో చురుకుగా పర్యటిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రజా, పార్టీ కార్యక్రమమైనా స్వయంగా పాల్గొంటూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో నిరంతరం మమేకమవుతున్నారు. గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చైతన్యం తీసుకురావడంలో ముందుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో పొన్నకల్, రాచాల, గుడిబండ గ్రామాల బూత్‌ల వారీగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ఆల వెంకటేశ్వర్ రెడ్డి నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవుతుండటం విశేషం. ఆయన పిలుపునకు లభిస్తున్న విశేష స్పందన నియోజకవర్గంలో ఆయనకు ఉన్న ప్రజాదరణకు నిదర్శనంగా నిలుస్తోందని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ, ఓటర్ల సవరణ వంటి కీలక అంశాలపై చైతన్యం కల్పించడంలో ఆయన చూపుతున్న చొరవ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

## వరంగల్ లో ఇసుక దుమారం

వరంగల్ : వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే? దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ? బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా? కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్.దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప? ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

## పలు శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీరం హర్షవర్ధన్ రెడ్డి







కొల్లాపూర్, (సమయం ప్రతినిధి): కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ, రిసెప్షన్ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొల్లాపూర్ పట్టణానికి చెందిన కొమ్మ బాలేశ్వరమ్మ-రాము యాదవ్ దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమారుడు భాను ప్రకాష్ యాదవ్, శశిరేఖల వివాహ రిసెప్షన్‌కు హాజరైన ఆయన, వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కొల్లాపూర్ మండలం లచ్చ నాయక్ తండ గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ ఆహ్వానం మేరకు శివాజీ-పవన్‌ల వివాహ మహోత్సవంలో పాల్గొని ఆశీర్వచనాలు అందించారు. ఆ తర్వాత పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండ గ్రామానికి చెందిన ఎస్లావత్ బుజ్జమ్మ-హర్జ నాయక్ దంపతుల కుమారుడు లచ్చిరాం, శైలజల రిసెప్షన్‌కు హాజరయ్యారు. తదనంతరం కేతావత్ చాందిని-మాన్ సింగ్ దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమారుడు శ్రీశైలం, ఉషశ్రీల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 28 న లట్టుపల్లి పి.హెచ్.సి లో పోలియో



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఈనెల 28న ఆదివారం నాడు పోలియో చుక్కల కేంద్రాల ద్వారా పుట్టిన బిడ్డనుండే ఐదు సంవత్సరాల వరకు గల పిల్లలందరికీ రెండు చుక్కల పోలియోమందును ఉచితంగా వేస్తున్నట్లు లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ టి.ప్రసన్న తెలిపారు. మంగనూరు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ నందు పోలియో చుక్కల కేంద్రం ఏర్పాటు చేశామని, అదేవిధంగా మంగనూరు గ్రామపంచాయతీ దగ్గర,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర, లట్టుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వద్ద, లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, గౌరారం ఎర్రకుంట తండా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద,భీముని తాండ,చిన్న పేరు తాండ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద, గంగారం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలియో చుక్కల కేంద్రాలు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు.మొబైల్ టీం ద్వారా అన్ని గిరిజన తండాలలో పోలిచికలు ఆరోగ్య సిబ్బంది వచ్చి ఉదయము 7 గంటల నుండి సాయంత్రం 6 గంటలలోపు అందరికి వేస్తారని ఆమె తెలిపారు.పెద్ద తాండ,వాసురం తండా,నక్కల చెరువు తండా, ఉడుగులకుంట తండా,బోర్సు గడ్డ తండా, ఎర్రకుంట తండా, కీమ్యాతాండా మరియు ఇతరతాండాలకు ఆరోగ్య సిబ్బంది ఆదివారం, సోమవారము,మంగళవారం నాడు వాహనం ఆశా కార్యకర్తలతో పాటు సిబ్బంది లో వచ్చి తప్పనిసరిగా అర్హులైన 5 సంవత్సరాల పిల్లల వారందరికీ ఉచితంగా పోలిచుక్కలు వేస్తారని ఆమె తెలిపారు.గ్రామ సర్పంచులు,నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు,స్వయం సంఘాల సభ్యులు,పిల్లల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు సహకరించి పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించుకోవాలని ఆమె కోరారు. ప్రయాణంలో ఉన్నప్పటికీ దగ్గరలోని పోలియో చుక్కల కేంద్రంలో పొలిచుక్కలు వేయించాలన్నారు.మరిన్ని వివరాలకు 9963583207లో సంప్రదించాలన్నారు.

## పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో..

హైదరాబాద్ : ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి 69 అడుగుల ఎత్తులో రూపొందించనున్నారు. పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో ఖైరతాబాద్ మహా గణేషుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. ఇక ఆ విగ్రహానికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం.. మరోవైపు కాళీమాత విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈసారితో ఖైరతాబాద్ ఉత్సవాలకు 72 ఏళ్లు పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి జరగనుండగా.. తాజాగా కర్ర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి ఉత్సవాలు నేటితో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. తాజాగా ఈసారి ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఇవాళ ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించింది. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాళికామాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు.వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెల్చి చెప్పారు.

# మాదకద్రవ్యాలపై సమరభేరి - వరంగల్‌లో 2కే రన్‌కు భారీ స్పందన





**వరంగల్, (సమయం ప్రతినిధి):** మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో చైతన్యం కల్పించేందుకు "సే నో టు డ్రగ్స్ - యెస్ టు లైఫ్" నినాదంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో భారీ 2కే రన్ నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, పోలీస్ కమిషనర్ సంప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. నగర ప్రధాన వీధుల మీదుగా సాగిన ర్యాలీ హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద ముగిసింది. "మాదకద్రవ్యాలు వద్దు - ఆరోగ్యమే ముద్దు", "డ్రగ్స్ ఫ్రీ వరంగల్" వంటి నినాదాలతో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ముగింపు సభలో 2కే రన్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సంప్రీత్ సింగ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని అన్నారు. డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. నాగరాజు మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం కలిసి యువతను క్రీడలు, యోగా, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి, ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డీసీపీ దార కవిత, డీసీపీ అంకిత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### అదనపు కలెక్టర్ మధుమోహన్ కు వినతిపత్రం అందించిన స్వర్ణకార సంఘం నాయకులు



జోగులాంబ గద్వాల : తెలంగాణ రాష్ట్రం సాధించడంలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులు పాత్ర గణనీయమైనదని, సాధించిన తెలంగాణలో స్వర్ణకారుల బతుకులు బాగుపడతాయని అనుకున్నాము కానీ నేడు స్వర్ణకారుల పరిస్థితి నానాటికి దిగజారి పోతున్నదని అన్నారు. కార్పొరేట్ వారు పెద్ద ఎత్తున పెట్టుబడులతో జువెల్లరీ షాపులు నెలకొల్పుతూ మోసపూరిత ఆర్భాటపు ప్రకటనలు చేస్తూ స్వర్ణకారులను దెబ్బతీస్తున్నారన్నారు. దయచేసి మా వినతులు మన్నించి స్వర్ణకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుచున్నామని తెలుపుతూ స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలి నియమించాలని, జీవో నెంబర్ 272 ను సవరణ చేసి పటిష్టంగా అమలుపరచి స్వర్ణకారులు అదనపు కలెక్టర్ మధుమోహన్ కు అందించిన అవినీతి పత్రంలో కోరారు. అదేవిదంగా 50 సంవత్సరాలు దాటిన స్వర్ణకార వృత్తిదారులకు గీత నేత కార్మికులకు ఇచ్చే విధంగా ఐదు వేల రూపాయలు పింఛను మంజూరు చేయాలని కోరారు స్వర్ణకారుల సంఘం నాయకులు అధ్యక్షులు జి సుదర్శన ఆచారి, ప్రధాన కార్యదర్శి బంగారు కే శంకరయ్య ఆచారి, కోశాధికారి కే భీష్మాచారి వినతి పత్రాన్ని అందించారు. ఇట్టి కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు 29వ వార్డు కౌన్సిలర్ కరాటే సత్యం, రాఘవేంద్ర ఆచారి, మహమ్మద్, బైరోజు రాఘవేంద్ర చారి, రాజు, మియా పాషా, జానకి రాములు, రాజు ఆచారి తదితరులు ఉన్నారు.

# జూరాల ఘటనపై చిట్టెం ఆగ్రహం



### బాధితుడికి న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
### పరిహారం అందించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆత్మకూరు : మక్తల్ నియోజకవర్గం ఆత్మకూర్ మండలంలోని జూరాల గ్రామంలో చోటుచేసుకున్న వివాదాస్పద ఇంటి నిర్మాణ స్థలాల విక్రయాల అంశం రాజకీయ దుమారం రేపుతోంది. ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించడం సరికాదంటూ బీఆర్ఎస్ నాయకుడు నరసింహులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో నరసింహులు చేతికి గాయమైంది. ఘటన అనంతరం మక్తల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి జూరాల గ్రామానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అనంతరం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బాధితుడికి న్యాయం చేయడంతో పాటు తగిన పరిహారం అందించాలని, ఘటనకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై జయన్న ను డిమాండ్ చేశారు. అలాగే జూరాల ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్, నాయకులు పిన్నంచర్ల బంగారు శ్రీనివాసులు, మాసన్న, రియాజ్ తదితరులు ఉన్నారు.

## 28న పోలియో చుక్కల పంపిణీ
## బిజినపల్లి వైద్యాధికారి డాక్టర్ పి. సృజన



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28న ఆదివారం ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల వరకు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు ఆదివారం ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాల ద్వారా ఉచితంగా ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. బిజినపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో,బిజినపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర, ప్రాథమిక పాఠశాల గాంధీ నగర్, ప్రగతి స్కూల్ పోలీస్ స్టేషన్ పక్కన, శాయిన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,మహాదేవుని పేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, మమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో, వట్టెం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,వెలుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,పోలేపల్లి ప్రాథమిక పాఠశాల దగ్గర, మొబైల్ టీం ద్వారా బోయపూర్ ,ఆన్ కాన్ పల్లి తండా,ఇతర తండాలు , ఇటుక బట్టీలు , గుడిసెలలో పర్యవేక్షకులు,ఆశా కార్యకర్తలు,సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన వాహనంలో వచ్చి తప్పనిసరిగా అర్హులైన వారికి పోలియో చుక్కలు వేస్తారని ఆమె తెలిపారు. పుట్టిన బిడ్డ నుండి అయిదు సంవత్సరాలు వయసున్న వారందరూ తప్పనిసరిగా ఆదివారం నాడు పోలియో చుక్కల మందు ఉచితంగా వేయించుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు పర్యవేక్షకులు అశోక్ గారిని సెల్ లో 9490927816 కు సంప్రదించాలన్నారు.

## భీమిలి నుంచి తేజస్విని

విశాఖపట్టణం : భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్యాటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు.

# దొంగ తీర్మానాలు చేసి, ప్రహరీ కూల్చిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి. సరిత తిరుపతయ్య, గారి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు. గద్వాల నియోజకవర్గంలో కొందరు అడ్డదారుల్లో కాంగ్రెస్లో చేరినట్టు నటించి, పదవులు పొంది, దొంగ తీర్మానాలు చేస్తూ, అందిన కాడికి దండుకొని, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నవారికి కొమ్ముకాసిన సన్యాసులపై, వెనక ఉండి నడిపించే నాయకులపై, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.
మీరు కాంగ్రెస్ పార్టీలో చేరింది ఇలాంటి దొంగ తీర్మానాలు చేసి, ప్రభుత్వ స్థలాన్ని భూస్వాములకు కట్టబెట్టేందుకేనా? అని నిలదీస్తున్నాము. అధికారులను తన గుప్పట్లో పెట్టుకొని ఆడింది ఆట, పాడింది పాటగా, వ్యవహరిస్తున్న మీకు, ప్రజాస్వామ్యంలో గుణపాఠం తప్పదు. వ్యవసాయ మార్కెట్ ప్రహరీ కూల్చివేతలో ప్రమేయం ఉన్నవారందరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, గోన్పాడు శ్రీనివాస్ గౌడ్, పెద్దపల్లి రాజశేఖర్ రెడ్డి, ఆరగిద్ద సర్పంచ్ బాలకృష్ణ, సుధీర్ గౌడ్, పేతురు రాజు, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది.




బ్లాక్‌బస్టర్ హిట్ 'తుడరుమ్' కాంబో రిపీట్ కాబోతోంది. మోహన్ లాల్ తరుణ్ మూర్తి కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు సిద్ధమవుతోంది. 'తుడరుమ్' సక్సెస్ తర్వాత వీరి కాంబోలో తెరకెక్కుతోన్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'అతి మనోహరం' . ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచి భారీ అంచనాలను ఏర్పరచుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని ప్రకటిస్తూ మేకర్స్ విడుదల చేసిన పోస్టర్ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్ ప్రకారం క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ పోస్టర్‌ని గమనిస్తే.. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. పోస్టర్‌లో మోహన్ లాల్ చాలా సాంప్రదాయబద్ధమైన లుక్‌లో, మోకాళ్లపై కూర్చుని నటి మీరా జాస్మిన్ వైపు ఎంతో ప్రేమగా చూస్తున్న విజువల్స్ ప్రేక్షకులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు, ఆమె చీర కుచ్చిళ్లను ఆయన సరి చేస్తుండటం ఎంతో అందంగా, ఎమోషనల్ టచ్‌ని ఇస్తోంది. 'తుడరుమ్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత వస్తున్న సినిమా కావడం, పోస్టర్ అద్భుతంగా ఉండటంతో ఒక్కసారిగా ఈ సినిమాపై అంచనాలు రెట్టింపవుతున్నాయి. ఇందులో చాలా గ్యాప్ తర్వాత మోహన్ లాల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. ఆశిక్ ఉస్మాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆశిక్ ఉస్మాన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఒక విలక్షణమైన ఎమోషనల్ అండ్ రియలిస్టిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం, ఖచ్చితంగా బాక్సాఫీస్ వద్ద మరోసారి మ్యాజిక్ రిపీట్ చేస్తుందని చిత్రబృందం ఎంతో ధీమా వ్యక్తం చేస్తోంది. సో.. మలయాళంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మోహన్ లాల్ అభిమానులు ఈ 'అతి మనోహరమైన' విజువల్ ట్రీట్ కోసం డిసెంబర్ 24 వరకు వెయిట్ చేయాల్సిందే.





ప్రస్తుతం ఏఐ టెక్నాలజీని అందరూ ఏ రేంజ్ లో ఉపయోగిస్తున్నారో అందరికీ తెల్సిందే. కొందరు చెడుకి ఉపయోగిస్తుంటే.. మరికొందరు మంచికి ఉపయోగిస్తున్నారు. కానీ, ఫ్యాన్స్ మాత్రం తమ అభిమాన హీరోల సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఏఐని ఉపయోగిస్తున్నారు. స్టార్ హీరో కొత్త సినిమా నుంచి ఒక చిన్న అప్డేట్ వస్తే చాలు దాంతో కథ మొత్తాన్ని ఏఐతో అల్లేసి దర్శకులకే దడ పుట్టిస్తున్నారు. తాజాగా పవన్ కళ్యాణ్– సుజీత్ కాంబోలో వస్తోన్న ఓజీ2 కి సంబంధించిన ఒక అప్డేట్ ఇలా వచ్చిందో లేదో.. సోషల్ మీడియా అంతా ఏఐ ఎడిట్స్ తో పిచ్చెక్కించారు. పవన్ కళ్యాణ్ హీరోగా, యువ దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఓజీ బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను సాధించి రికార్డులను సృష్టించింది. పవర్ స్టార్ స్వాగ్, సుజీత్ డైరెక్షన్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థియేటర్లలో ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని పంచాయి. ఆ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత అభిమానుల ఉత్సాహాన్ని అమాంతం పెంచుతూ, మేకర్స్ ఇప్పుడు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఓజీ పార్ట్ 2 ప్రాజెక్టును అధికారికంగా ప్రకటిస్తూ, ప్రీ-ప్రొడక్షన్ పనులు లాంఛనంగా ప్రారంభమైనట్లు ఒక స్పెషల్ వీడియో ద్వారా వెల్లడించారు. ఈ స్పెషల్ అనౌన్స్‌మెంట్‌లో అందరి దృష్టినీ ఆకర్షించిన అతిపెద్ద సర్ప్రైజ్ ఇంకొకటి ఉంది. ఓజీ 2 లో కేవలం యాక్షన్, ఎమోషన్స్ మాత్రమే కాకుండా, పవన్ కళ్యాణ్ క్యారెక్టర్‌కు అనుబంధంగా పెంపుడు జంతువుగా డ్రాగన్ కూడా ఉండబోతోందని సుజీత్ చెప్పుకొచ్చాడు. ఈ వార్త బయటకు రాగానే ఫ్యాన్స్‌లో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. సుజీత్ రైటింగ్ స్టైల్‌ను బట్టి చూస్తే, ఈ పెట్ క్యారెక్టర్ కేవలం వినోదం కోసం కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన అంశంగా ఉండే అవకాశం ఉంది. ఇక ఈ ఒక్క అప్డేట్ సోషల్ మీడియాను షేక్ చేసింది. గంభీర పెట్ డ్రాగన్ తో పవన్ ఫ్యాన్స్ ఎడిట్స్ మొదలుపెట్టారు. అసలు ఒక్కో ఎడిట్ ఒక్కో డైమండ్ అని చెప్పాలి. అచ్చు గుద్దినట్లు ఒరిజినల్ సినిమాలో ఉన్నట్లే డ్రాగన్ తో పవన్ కనిపించారు. ప్రస్తుతం ఈ ఎడిట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ ఎడిట్స్ చూసినవారు సుజీత్ వాళ్ళని ఆపు అని సరదాగా కామెంట్స్ చేస్తుంటే.. ఓరీ మీ దుంపలు తెగ మీరెక్కడ దొరికారురా.. ఆపండ్రా బాబు అని ఇంకొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ ఎడిట్స్ కి తగ్గట్లు సుజీత్.. సినిమాలో చూపిస్తాడా.. ? లేక ఈ ఎడిట్లే బావుంటాయా అనేది చూడాలంటే ఓజీ 2 రిలీజ్ అయ్యేవరకు ఆగాల్సిందే.




కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన సొంత బ్యానర్ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పై తెరకెక్కుతోన్న చిత్రం ధర్మన్ . ఓ మై కడవులే చిత్రంతో టాలెంటెడ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్స్ గా నటిస్తోన్నారు. సౌత్ ఇండస్ట్రీలోనే ఇద్దరు బిగ్గెస్ట్ లెజెండ్స్ కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమా కథాంశానికి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ ధర్మన్ సినిమా కథ ఒకప్పుడు టాలీవుడ్‌లో నటభూషణ శోభన్ బాబు హీరోగా నటించిన కల్ట్ క్లాసిక్ సూపర్ హిట్ చిత్రం సర్పయాగం కి రీమేక్‌లా ఉండబోతోందని గట్టిగా ప్రచారం సాగుతోంది. కూతురు కోసం హత్యలు చేసే ఒక డాక్టర్ కథ.. సర్పయాగం. తండ్రిగా శోభన్ బాబు నటించగా.. కూతురిగా రోజా కనిపించింది. 1991లో ఎంతో సంచలనం సృష్టించిన ఈ చిత్రం తండ్రీకూతుళ్ల సెంటిమెంట్, సమాజంలోని అన్యాయాలపై ఒక తండ్రి చేసే పవర్‌ఫుల్ రివెంజ్ డ్రామా నేపథ్యంలో సాగుతుంది. కొంతమంది డాక్టర్ కూతురిని అత్యాచారం చేసి చంపేస్తారు. వారిపై పగ తీర్చుకోవడానికి ఆ డాక్టర్ ఏం చేశాడు.. ? హత్యల కోసం వైద్య విధానాన్ని ఎలా వాడుకున్నాడు.. ? అనేది సర్పయాగం కథ. ఇప్పుడు ఈ స్టోరీ లైన్ తోనే ధర్మన్ తెరకెక్కనుందని టాక్ నడుస్తోంది. రజనీకాంత్ బాడీ లాంగ్వేజ్‌కు, ఆయన మాస్ ఇమేజ్‌కు ఈ తరహా ఇంటెన్స్ ఎమోషనల్ సబ్జెక్ట్ వంద శాతం పర్‌ఫెక్ట్‌గా సరిపోతుందని, అందుకే అశ్వత్ మారిముత్తు ఈ పాత కథను నేటి తరం ట్రెండ్‌కు తగ్గట్లుగా స్క్రిప్ట్ మార్పులు చేసి లీడ్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే.. థియేటర్లలో రజనీకాంత్ నటనకు, ఎమోషన్స్‌కి ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయమని ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. ఈ సినిమాలో రజనీ కూతురుగా రాశీ ఖన్నా కనిపించబోతోందంట. తండ్రిగా నటించడం రజనీకి కొత్తేమీ కాదు. ముఖ్యంగా ఇలాంటి తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ తోనే రజనీ దర్బార్ సినిమా చేశారు.

Cinema




రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రం మరో నాలుగు నెలల్లో పూర్తవుతుందని జక్కన్న స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న రాజమౌళి అక్కడి మీడియాతో మాట్లాడుతూ 'వారణాసిలో ముఖ్యమైన సన్నివేశాలను పూర్తిచేశాం. యాక్షన్ సీక్వెన్స్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం కథను లింక్ చేసే సన్నివేశాల చిత్రీకరణ చేస్తున్నాం. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికి షూటింగ్ మొత్తం పూర్తవుతుంది' అని అన్నారు. ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడం గురించి చెబుతూ 'వారణాసి'ని ఐమాక్స్‌లో అయితే అద్భుతంగా ఉంటుందని ప్రారంభంలోనే అనుకున్నాం. అయితే దీని కోసం కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. చిన్న చిన్న సర్దుబాట్లు చేశామంతే! 'మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌లో షూట్ చేయడానికి అలవాటు పడ్డాయి. అయితే, మొదటి నుంచి ఐమ్యాక్స్, సినిమా స్కోప్‌నకు మ్యాచ్ అయ్యేలా సీన్స్‌ను ఫ్రేమ్ చేయాలనుకున్నాం. సినిమా ప్రాజెక్ట్ అయ్యే స్క్రీన్‌కు అనుగుణంగా ఇమేజ్, వీడియో క్వాలిటీ దెబ్బతినకుండా పెద్దదిగా చేసే ప్రక్రియ. అదే అనామార్ఫిక్ ఫ్రేమింగ్. దీని వల్ల తొలిరోజుల్లో సర్దుబాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఏది ఎలా చేయాలో అవగాహన వచ్చింది. దీంతో పని ఈజీ అయింది' అని తెలిపారు రాజమౌళి. ఈ చిత్రంలో మహేశ్‌కు జోడీగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.




బాలీవుడ్ యాక్షన్ స్టార్ జాన్ అబ్రహాం ఇప్పుడు సరికొత్త అవతారం ఎత్తారు. సిల్వర్ స్క్రీన్‌పై తన బాడీతో, యాక్షన్‌తో మెప్పించిన ఈ హంక్... ఇప్పుడు సినిమాలను పక్కన పెట్టి క్రికెట్ పిచ్‌పై సరికొత్త ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. అయితే ఆయన ఇక్కడ ప్లేయర్‌గా కాదు... ఏకంగా ఓ అంతర్జాతీయ క్రికెట్ జట్టుకే బాస్‌గా మారారు. యూరప్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగబోతున్న 'యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్'లో నెదర్లాండ్స్‌కు చెందిన 'రోటర్‌డ్యామ్ డాకర్స్' ఫ్రాంచైజీని జాన్ అబ్రహాం కొనుగోలు చేసి ఆ జట్టుకు కో–ఓనర్‌గా మారారు. ట్విస్ట్ ఏంటంటే... ఈ జట్టులో జాన్ అబ్రహాం ఒక్కరే కాదు ఆయనతో పాటు క్రికెట్ దిగ్గజాలు జాంటీ రోడ్స్, ఫాఫ్ డు ప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్ వంటి వరల్డ్ క్లాస్ ప్లేయర్స్ కూడా భాగస్వామ్యులై ఈ టీమ్‌ను నడిపించబోతున్నారు. సమాజాన్ని ఏకం చేసే శక్తి ఒక్క క్రికెట్‌కే ఉందని.. అందుకే తాను ఈ లీగ్‌లో భాగమయ్యానని జాన్ అబ్రహాం స్వయంగా ప్రకటించారు. మేనేజింగ్ పార్టనర్ మధుకర్ శ్రీ కూడా ఈ టీమ్‌లో ఉన్నారు. అయితే ఈ టోర్నమెంట్‌లో కేవలం జాన్ మాత్రమే కాదు... మరో బాలీవుడ్ స్టార్ అభిషేక్ బచ్చన్ ఈ లీగ్‌కు కో–ఫౌండర్‌గా వ్యవహరిస్తుండగా, రాహుల్ ద్రవిడ్, స్టీవ్ వా, మాథ్యూ హేడెన్ లాంటి లెజెండ్స్ కూడా వేర్వేరు జట్లకు ఓనర్లుగా ఉన్నారు. ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ దేశాల్లో క్రికెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లడమే లక్ష్యంగా మొత్తం ఆరు నగరాల ఫ్రాంచైజీల మధ్య ఈ టోర్నీ సాగనుంది. మరి ఈ సరికొత్త క్రికెట్ బిజినెస్‌లో మన బాలీవుడ్ హీరో జాన్ అబ్రహాం ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో చూడాలి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085